సాక్షి
జగిత్యాల
సోమవారం ၊ 18 ၊ డిసెంబర్ ၊ 2023



గోదావరిలో భక్తుల రద్దీ

ధర్మపురి: గోదావరిలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఖివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. అనంతరం స్వాములను దర్శించుకున్నారు.



కొండగట్టులో చందన పూజ

కొండగట్టు శ్రీఆంజనేయస్వామి వారి ఆలయంలో త్వరలో చందనోత్సవ పూజకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆలయ ఈవో వెంకటేశ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
27.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది. చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ముక్కోటి ఏకాదశికి రండి



ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ఈవో

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 23న జరిగే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు రావాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఆలయ ఈవో శ్రీనివాస్ ఆహ్వానించారు. ఆయనకు స్వామి వారి శేష వస్త్రం, ప్రసాదాలు అందించారు.

ఆలయ అభివృద్ధికి కృషి



భూమిపూజలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: గౌడ కులస్తుల ఇష్టదైవం శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి కృషి చేస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జగిత్యాలరూరల్ మండలం కన్నాపూర్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీరేణుకాఎల్లమ్మ ఆలయ శంకుస్థాపనకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ కొక్కు సుధాకర్, నాయకులు ప్రభు, వేణు, మురళి, గంగారెడ్డి పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి ప్రత్యేక పూజలు చేశారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం



జగదీశ్వర్‌కు స్వాగతం పలుకుతున్న టీఎన్జీవోలు

జగిత్యాలటౌన్: ప్రభుత్వంతో చర్చించి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లాకు వచ్చిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వానికి స్వాగతం పలుకుతున్నామని తెలిపారు. ఉద్యోగుల ప్రధాన సమస్యలైన సీపీఎస్ రద్దు, పాతన పెన్షన్ పునరుద్ధరణ, పెండింగ్ డీఏల మంజూరు వంటి అంశాలపై ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. టీఎన్జీవో, ట్రెసా నాయకులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామికి వెండిహారం



హారం అందిస్తున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామికి మండలకేంద్రానికి చెందిన భక్తులు మూమ్మడి స్వామి, కళావతి, లహరి, మేఘన ఆదివారం రూ.50,116 విలువైన వెండి హారాన్ని బహూకరించారు. హారాన్ని అర్చకులకు అందించి స్వామివారిని దర్శించుకుని మొక్కు తీర్చుకున్నారు.

సీఎంఆర్ ఆలస్యం

- డిఫాల్ట్ మిల్లర్లకు అధికారుల వత్తాసు
- 69 శాతం బియ్యం మాత్రమే అప్పగింత
- ప్రభుత్వ ఆదేశాలు పట్టని మిల్లర్లు

జగిత్యాలరూరల్: రైస్‌మిల్లులకు చేరిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి ప్రభుత్వానికి అప్పగించడంలో జిల్లాలోని మిల్లర్లు నిర్లక్ష్యం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు (సీఎంఆర్) కస్టమ్‌మిల్లింగ్‌కు అప్పగిస్తుంది. మిల్లర్ల దానిని బియ్యం మార్చి గడువులోపు ఎఫ్‌సీఐకి అప్పగించాలి. అయితే జిల్లాలోని మిల్లర్లు ప్రభుత్వం వద్ద తీసుకున్న ధాన్యానికి సంబంధించిన బియ్యాన్ని మాత్రం ఇప్పటివరకు అప్పగించకుండా తీవ్ర జాప్యం చేస్తున్నారు. జాప్యం చేస్తున్న మిల్లర్లపై కొరడా ఝులిపించేందుకు అధికారయంత్రాంగం వెనుకడుగు వేస్తోంది. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో కూడా జిల్లా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని సమాచారం. గడువులోగా బియ్యం ఇవ్వకుండా జాప్యం చేస్తున్న మిల్లులకు గతనెలలో సివిల్‌సప్లై అధికారులు వానాకాలం సీజన్ ధాన్యం కేటాయించలేదు. దీంతో రంగంలోకి దిగిన రాజకీయ నాయకులు అధికారులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి తిరిగి ధాన్యం కేటాయించేలా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

45 మంది రైస్‌మిల్లర్ల డిఫాల్టర్లు

గత నెలలో ప్రభుత్వానికి 60 శాతం బియ్యం ఇవ్వని 45 మంది రైస్ మిల్లర్లను డిఫాల్టర్లుగా ప్రకటించారు. అయితే వారి యూనియన్ నేతల జోక్యంతో 35 మంది రైస్‌మిల్లర్లు 100 శాతం కేటాయించినట్లు లెక్కలు చూపించి వారికే మళ్లీ ధాన్యం కేటాయించేలా చక్రం తిప్పారు. గతంలో బకాయి ఉన్నా.. మళ్లీ చాలామంది రైస్‌మిల్లర్లకు రాజకీయ ఒత్తిళ్లతో ధాన్యం కేటాయించారు. జిల్లాలో ప్రస్తుతం సేకరించిన ధాన్యాన్ని జిల్లాలోని 49రారైస్‌మిల్లులకు 86 వేల మెట్రిక్ టన్నులు, 62పారాబాయిల్డ్ రైస్‌మిల్లులకు 1.74లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించారు. ఈ ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి ఉంది.



జిల్లాకేంద్రంలోని ఓ రైస్‌మిల్లు

ప్రభుత్వానికి బకాయి

జిల్లాలోని రైస్‌మిల్లులు కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వానికి బియ్యం అప్పగించాల్సి ఉంది. రా రైస్‌మిల్లర్లు 35,179 మెట్రిక్ టన్నులు, పారాబాయిల్డ్ రైస్‌మిల్లర్లు 35,815 మెట్రిక్ టన్నుల ధాన్యం అప్పగించాల్సి ఉంది. వీరంతా కేవలం ప్రభుత్వానికి 69 శాతం మాత్రమే బియ్యం అప్పగించారు. మిగతా 31 శాతం ఈనెల చివరినాటికి అప్పగించాల్సి ఉంది. అన్ని మిల్లులు కలిపి మొత్తంగా 74 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది.

ఆరు రైస్‌మిల్లర్లు బ్లాక్‌లిస్ట్‌లో..

ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు కేటాయించినా ఆరుగురు రైస్‌మిల్లర్లు మాత్రం ప్రభుత్వ లక్ష్యం మేరకు బియ్యం అప్పగించలేదు. వాటిని అధికారులు డిఫాల్ట్‌గా ప్రకటించారు. వారి నుంచి ఇంకా 2,900మెట్రిక్‌టన్నుల బియ్యం రావాల్సి ఉంది.

చర్యలు చేపడుతున్నాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు 60 శాతం బియ్యం అప్పగించిన మిల్లులకే ధాన్యం కేటాయించాం. ప్రభుత్వానికి బకాయి ఉన్న రైస్‌మిల్లర్లపై ఒత్తిడి పెంచి బియ్యం అప్పగించేలా చర్యలు చేపడుతున్నాం. అప్పగించని ఆరుగురు రైస్‌మిల్లర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాం. వీరికి ధాన్యం కేటాయించలేదు.

– వెంకటేశ్వర్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

నిరాశ్రయులకేదీ చోటు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది సునీత. ఆమెది నిజామాబాద్. కుటుంబసభ్యులెవరూ లేకపోవడంతో జగిత్యాలకు చేరుకుని యాచిస్తూ జీవనం సాగిస్తోంది. రాత్రిపూట ఆర్టీసీ బస్‌స్టాండ్‌లోనే ఉంటోంది. చలికి నిద్రపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తోంది.



ఈయన పేరు రాజం. ఆదిలాబాద్ జిల్లా. కుటుంబసభ్యుల నిరాదరణకుగురై జగిత్యాల చేరాడు. పొద్దంతా అడుక్కుని ఆకలి తీర్చుకుంటున్న ఇతడు రాత్రిపూట జగిత్యాల ఆర్టీసీ బస్ స్టాండ్‌లోనే నిద్రిస్తున్నాడు. చలి తీవ్రత పెరగడంతో ఇబ్బంది పడుతున్నానని, ఆశ్రయం కల్పించాలని కోరుతున్నాడు.





ఆర్టీసీ బస్టాండ్‌లో చలిలోనే నిద్రిస్తున్న అభాగ్యులు

- గూడు లేక చలికి వణుకుతున్న వైనం
- పట్టణంలో పదుల సంఖ్యలో అభాగ్యులు
- ఆర్టీసీ బస్‌స్టాండ్, వారసంతలే దిక్కు

జగిత్యాలటౌన్: పేదరికం.. వివిధ కారణాలతో అయినవారికి దూరమైన వారికి జిల్లాలో ఆశ్రయం దొరకడం లేదు. ఇలాంటివారు జిల్లాకేంద్రంలో సుమారు వందకుపైగా ఉన్నారు. వారికి కనీసం తల దాచుకునే సౌకర్యం లేక వారసంత, ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో తలదాచుకుంటున్నారు. చలికాలం కావడంతో గజగజ వణుకుతూ దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. గతంలో పట్టణంలోని టౌన్‌హాల్‌లో పట్టణ నిరాశ్రయుల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానిని బల్దియా అధికారులు ఇ–సేవ కేంద్రం సమీపంలోని రెండో అంతస్తులోని ఇరుకైన గదుల్లోకి మార్చడంతో పైకి ఎక్కలేక కొందరు.. అవగాహన లేక మరికొందరు ప్రభుత్వ కార్యాలయాల గేట్లు, ఖాళీ ప్రదేశాల్లోనే గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సర్కారు ఖజానాలో పైసల్లేవ్



మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలను గజమాలతో సన్మానిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

- క్రమశిక్షణతో ఆదాయం పెంచుతాం
- పదిరోజుల్లో మరో రెండు గ్యారెంటీలు అమలు చేస్తాం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/కమాన్‌పూర్/రామగిరి/మంథని: ప్రస్తుతం సర్కారు ఖజానాలో పైసల్లేవని, క్రమశిక్షణతో ఆదాయం పెంచుకుంటామని ఐటీ, పరిశ్రమలు, అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం పదిరోజుల్లో మరో రెండు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు. మంత్రిగా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన శ్రీధర్‌బాబు ఆదివారం జిల్లాలో పర్యటించారు. తొలుత సుల్తానాబాద్ మండలానికి చేరుకున్న ఆయన.. పెద్దపల్లి, కమాన్‌పూర్, సెంటినరీకాలనీ మీదుగా మంథని చేరుకున్నారు. అడుగడుగునా ఆయనకు కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే ఠాకూర్ మక్కాన్‌సింగ్ మంత్రి వెంట ఉన్నారు.

యువతకు ఉద్యోగాలు ఇస్తాం

జిల్లా కేంద్రంగా మారిన పెద్దపల్లి రూపురేఖలు మార్చుతామని, అభివృద్ధిలో ముందు వరుసలో నిలుపుదామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. జిల్లాలో పరిశ్రమలు ఉన్న రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అవసరం మేరకు మరిన్ని పరిశ్రమలు స్థాపిస్తామని హామీ ఇచ్చారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ, నియోజకవర్గానికి మంత్రి శ్రీధర్‌బాబు అండదండలు ఉండాలన్నారు. గతంలోనూ తనకెంతో సహకారం అందించారని గుర్తుచేశారు. స్పందించిన మంత్రి శ్రీధర్‌బాబు.. సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే విజ్జన్నకు అత్యంత సన్నిహితులన్నారు. తామంతా కలిసే జిల్లా అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు. జిల్లాతో తనకెంతో అనుబంధం ఉందని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంత్రి ఆదేశాలు అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇప్పటికే రెండు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని, మరో 15 రోజుల్లో ఇంకో రెండు అమలు చేస్తామన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ , పెద్దపల్లికి బైపాస్ రోడ్డు, బస్ డిపో, జిల్లా కోర్టు, 50 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి మంజూరు చేయిస్తామన్నారు. కాగా, సుల్తానాబాద్ ర్యాలీలో పలువురు దొంగలు చేతివాటం ప్రదర్శిస్తూ నాయకులు, ప్రజాప్రతినిధుల పర్సులు చోరీచేశారు.

ప్రజలు శాంతి కోరుకున్నారు..

కమాన్‌పూర్ మండలం గొల్లపల్లె వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంత్రికి ఘనస్వాగతం పలికారు. కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు మంత్రి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మంథని నియోజకవర్గంలో రౌడీయిజం రాజ్యామేలిందన్నారు. ప్రజలు శాంతియుత వాతావరణం కోరుకుని కాంగ్రెస్‌కు ఓట్లేసి గెలిపించారని అన్నారు. నాయకులు వైనాల రాజు, ఇనగంటి భాస్కర్‌రావు, కోలేటి మారుతి, తొట్ల తిరుపతియాదవ్, ఆకుల ఓదెలు, కట్కం రవీందర్, తొగరి అన్నపూర్ణ పాల్గొన్నారు.

కలవర పెడుతున్న ఆత్మహత్యలు

- సుమారు 15 రోజుల క్రితం.. జగిత్యాల జిల్లాకేంద్రంలోని మోచీబజార్‌కు చెందిన ఓ యువకుడు ఆర్థిక ఇబ్బందులతోపాటు ఉద్యోగం రావడం లేదని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
- ఇటీవల జగిత్యాల జిల్లాకేంద్రంలోని కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన ఓ వృద్ధురాలు వయోభారం భరించలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

- జిల్లాలో ఈ ఏడాది 224 మంది అఘాయిత్యం
- ఆర్థిక ఇబ్బందులతో మానసిక ఒత్తిడి
- చావు పరిష్కారం కాదంటున్న నిపుణులు

ఏడాది	ఆత్మహత్యలు
2021	282
2022	168
2023	224

జగిత్యాలక్రైం: జిల్లాలో కొద్దికాలంగా ఆత్మహత్యల పరంపర కొనసాగుతోంది. కారణాలేవైనా.. యువత, వృద్ధులు ప్రాణాలు తీసుకుంటుండడం కలవరపెడుతోంది. ఆర్థికఇబ్బందులు, మానసిక ఒత్తిళ్లే ప్రధాన కారణమని తెలుస్తున్నా.. క్షణికావేశంలో తీసుకుంటున్న ఇలాంటి చర్యలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి.

క్షణికావేశంలోనే ఆత్మహత్యలు

జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు వివిధ కారణాలతో 224 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. ఒక్కొక్కరిది ఒక్కో కారణం. తీవ్ర ఒత్తిళ్లకు లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.



జిల్లాలో ఎక్కడో ఏదో కారణంతో ఆత్మహత్య చేసకుంటున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మానసిక స్థితి సరిగ్గా లేకపోవడం, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, గృహ హింస, చదువులో విఫలమవడం, ప్రేమవిఫలం వంటి కారణాలతో ఈ బతుకు తమకొద్దు.. అంటూ అభాగ్యులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు నిత్యకృత్యమవుతున్నాయి. నచ్చిన కూర వండలేదనో, పండుగకు పుట్టింటికి పంపించలేదనో, సినిమాకు వద్దన్నారనో, చీరలు, నగలు కొనివ్వలేదనో, చివరకు పెళ్లి కాలేదనో, ఒంటరిగా బతకలేమనే కారణంతోనూ ఆత్మహత్య చేసుకుంటున్నారు. అయితే చాలామంది బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆత్మహత్యకు కారణం కడుపునొప్పి అని, అనారోగ్య సమస్యలు మాత్రమే పోలీసు రికార్డులకెక్కుతున్నాయి. ఆత్మహత్య చేసుకుంటున్న వారిలో ఎక్కువగా 15 నుంచి 40 ఏళ్ల వయస్సులోపు వారే ఉంటున్నారు. ఆత్మహత్యలను మానవీయ కోణంలో చూసి ప్రజల్లో స్థైర్యాన్ని నింపాల్సిన అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనబడటం లేదు. స్వచ్ఛంద సంస్థలు, అధికారులు ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉంది.

ఒక్కక్షణం ఆలోచించాలి..

- ఆత్మహత్య చేసుకోవాలనే వారు ఒక్క క్షణం ఆలోచించాలి. మీ కుటుంబాన్ని గుర్తు చేసుకోండి.
- సమస్యలు మనుషులకే వస్తాయి. వాటి నుంచి బయటపడే మార్గాన్ని అన్వేషిస్తూ ముందుకు వెళ్లాలి.
- ఓడిపోతే నిరాశావాదాన్ని వదిలిపెట్టి, ఆశావాదంతో ముందుకు కదలాలి.
- మనం ఉన్నప్పుడే కుటుంబాన్ని ఎవరూ ఆదుకోనప్పుడు.. మనం పోయిన తర్వాత కుటుంబాన్ని ఎవరు ఆదుకుంటారనే ఆలోచనకు రావాలి.
- రెండు కాళ్లు, రెండు చేతులు లేనివాళ్లే ఈ సమాజంలో బతుకుతున్నప్పుడు అన్ని అవయవాలు ఉన్న మనమెందుకు చావాలనే ఆలోచన మదిలో మెదలాలి.
- సమస్యలు ఎప్పుడూరావు కదా.. ఆ సమస్యలు వచ్చినప్పుడు కుంగిపోకూడదు. సమస్యల నుంచి బయటపడేలా చూసుకోవాలి.

ఆత్మస్థైర్యం కోల్పోవద్దు



చాలామంది ఏదైనా గొడవలు జరిగినప్పుడు క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడతారు. మరికొంత మంది మానసికంగా కుంగిపోయి ప్రాణాలు తీసుకుంటారు. ఆత్మహత్య సమస్యకు పరిష్కారం కాదు. ఆత్మస్థైర్యంతో ఎలాంటి సమస్యలైనా ఎదుర్కొంటేనే జీవితంలో మనిషి నిలదొక్కుకోవచ్చు.

– డాక్టర్ మల్లారెడ్డి, ఎండీ ఫిజీషియన్, జగిత్యాల

మానసిక ఒత్తిడితోనే



యువత మానసిక ఒత్తిడితో.. వృద్ధులు వయోభారంతో.. కొందరు కుటుంబ సమస్యలు, మరికొంతమంది చెడు వ్యసనాలకు అలవాటు పడి క్షణికావేశంలో ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. ఒంటరిగా ఉన్నప్పుడు మానసిక ఒత్తిడికి గురవుతాం. వాటిని పరిష్కరించుకోవాలిగానీ ఆత్మహత్య సరికాదు.


– డాక్టర్ సంతోష్, సైకాలజిస్ట్, జగిత్యాల

ఆత్మహత్యల పరిష్కారం కాదు




చాలామంది ఆత్మస్థైర్యం కోల్పోయి చిన్నచిన్న సమస్యలకు ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. గతంలో గ్రామాల్లో పోలీసు కళాబృందాలతో ఆత్మహత్యల నివారణ కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాం. సామాజిక సేవకులు కూడ ప్రజలకు అవగాహన కల్పించాలి.

– వెంకటస్వామి, డీఎస్పీ, జగిత్యాల



కూలిపోయిన కాలువలైనింగ్



కాలువ మధ్యలో ఇసుక, రాళ్లు

అధ్వానంగా కాలువలు

జగిత్యాలఅగ్రికల్చర్‌:యాసంగి పంటలకుగాను ఎస్సారెస్పీ నుంచి సోమవారం నీరు విడుదల చేయనున్నారు. అయితే కాలువలు అధ్వానంగా ఉండడంతో చివరి భూములకు నీరు చేరడం కష్టంగా మారింది. డ్రాపులు, తూములు కూలిపోయాయి. కాలువలో పెద్దపెద్ద రాళ్ల పడ్డాయి. జిల్లాలోని డీ–51 కాలువ పరిధిలో ఇలాంటి పరిస్థితి నెలకొంది.



తూముల వద్ద అడ్డుగా పెట్టిన రాళ్లు

ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాం

మెట్‌పల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో డబ్బు పంపిణీ చేయకుండా నిజాయితీగా వ్యవహరించి సత్తా చూపించామని బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. పట్టణంలో ఆదివారం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ విచ్చలవిడిగా డబ్బు, మద్యం పంపిణీ చేశాయని, బీజేపీ వాటికి దూరంగా ఉండి 61వేలకు పైగా ఓట్లు సాధించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 8స్థానాలు గెలుచుకున్నామని, మరో 18 చోట్ల రెండోస్థానంలో నిలిచామని, రాష్ట్రంలో బీజేపీ బలం పెరిగిందనడానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఓటమిపై కార్యకర్తలు ఆందోళన చెందొద్దన్నారు. రానున్న పార్లమెంట్, స్థానిక ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. అనంతరం ధర్మపురి ఫౌండేషన్ ద్వారా పలువురు కార్యకర్తల కుటుంబాలకు ఎంపీ ఆర్థిక సహాయం అందజేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు మోరపల్లి సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్, పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్ పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్వింద్

క్లుప్తంగా

అప్పు తీర్చాలని అంత్యక్రియల అడ్డగింత

మెట్‌పల్లి: అప్పు చేసి ఉడాయించిన ఓ వ్యక్తి.. తండ్రి అంత్యక్రియల కోసం రాగా ఆ తంతును అడ్డుకున్న సంఘటన ఆదివారం మెట్‌పల్లి పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. చిట్టీలు, ఫైనాన్స్ వ్యాపారం చేసే చైతన్యనగర్‌కు చెందిన ఓ వ్యక్తి కొంతకాలం క్రితం దివాళాపేరుతో ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు ఉడాయించాడు. పలువురి బాధితులకు సుమారు రూ.కోటికి పైగానే చెల్లించాల్సి ఉన్న ఆయన.. కొన్ని నెలల క్రితం తల్లి మరణించడంతో ఇంటికొచ్చాడు. ఆ సమయంలో తమ డబ్బులు తమకు ఇవ్వాలని బాధితులు పట్టుబట్టారు. తొందరలోనే చెల్లిస్తానని హామీ ఇవ్వడంతో ఆ సమయంలో వదిలిపెట్టారు. ఇచ్చిన గడువు ముగిసినప్పటికీ అతని నుంచి స్పందన లేకుండా పోయింది. శనివారం ఆయన తండ్రి చనిపోవడంతో ఆయన అంత్యక్రియల కోసం సదరు వ్యక్తి మళ్లీ ఇక్కడకు వచ్చాడు. దీంతో బాధితులంతా వెళ్లి అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డబ్బులు ఇచ్చేవరకూ అంత్యక్రియలు జరగనివ్వబోమని తేల్చి చెప్పారు. స్థానిక పెద్దలు జోక్యం చేసుకుని అతనితోపాటు మిగతా కుటుంబ సభ్యులతో బాధితులకు రాత పూర్వక హామీని ఇప్పించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత అంత్యక్రియల తంతును పూర్తి చేశారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

రుద్రంగి(వేములవాడ): పదిహేను రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న రుద్రంగికి చెందిన మోతె గంగాధర్(45) శనివారం అర్ధరాత్రి మృతిచెందాడు. జగిత్యాల జిల్లా కోరుట్ల నుంచి వస్తుండగా కథలాపూర్ మండలం సిరికొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స తీసుకొని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఇంటి వద్దే ఉంటుండగా శనివారం అర్ధరాత్రి గంగాధర్ మృతిచెందాడు. మృతుడికి భార్య జల, ఇద్దరు కుమారులు నిఖిల్(21), నితిన్(17) ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

జమ్మికుంట: మంచి నివేశన స్థలం రాలేదని మనస్తాపంతో జమ్మికుంట మండలంలోని సైదాబాద్‌కు చెందిన కోలుగూరి నాగరాజు ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడి వివరాల ప్రకారం.. నాగరాజు హమాలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో ఇంటి స్థలం కోసం అతనికి పట్టా మంజూరైంది. కానీ అధికారులు హద్దులు చూపించలేదు. ఈ క్రమంలో సైదాబాద్‌లోని సర్వే నంబర్ 234లో ఇటీవల ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, అధికారుల ఆధ్వర్యంలో మరోసారి డ్రా పద్ధతిలో అర్హులకు నివేశన స్థలాలు కేటాయించారు. తనకు వచ్చిన స్థలంలో బండ రాళ్లు, బొందలు ఉన్నాయని, ఇంటి నిర్మాణానికి అనువుగా లేదని నాగరాజు ఆవేదన వ్యక్తం చేశాడు. ఆదివారం సాయంత్రం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. స్థలం కేటాయింపులో తనకు న్యాయం చేయాలని అతను కోరుతున్నాడు.



ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు, అర్చకులు



ఆలయంలో క్యూలైన్లలో భక్తులు

రాజన్నకు కోడెమొక్కులు

వేములవాడ: రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయ ఆవరణ రద్దీగా మారింది. రాజన్నను హైదరాబాద్ కలెక్టర్ దుర్శెట్టి అనుదీప్ దంపతులు దర్శించుకున్నారు. కోడె మొక్కు చెల్లించుకున్నారు. ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు ఉన్నారు. రాజన్న దర్శనానికి వీఐపీల సంఖ్య పెరగడంతో పీఆర్వో కార్యాలయాన్ని మూసివేశారు. దీంతో వీఐపీలంతా పీఆర్వో ఆఫీస్ ముందే వేచి చూశారు.

రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది

ప్రభుత్వవిప్‌గా నియమితులై మొదటిసారి వేములవాడకు వచ్చిన ఆది శ్రీనివాస్‌ను రాజన్నను దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి ఘనస్వాగతం పలికారు.



రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకుంటున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దంపతులు

కొండగట్టులో చందన పూజ



కొండగట్టు ఆలయం

కొండగట్టు(చొప్పదండి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీఆంజనేయస్వామి వారి ఆలయంలో త్వరలో చందనోత్సవ పూజకు శ్రీకారం చుట్టనున్నట్లు ఆలయ ఈవో వెంకటేష్ తెలిపారు. వారంలో రెండురోజులపాటు పూజ నిర్వహిస్తారు. స్వామివారికి ప్రతి మంగళ, శనివారాల్లో చందనంతో అర్చకులు ఉదయమే అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఈ పూజలో పాల్గొనాలనుకునే భక్తులు ఒక్కరోజు ముందుగా ఆలయ అధికారులను సంప్రదించాల్సి ఉంటుంది. పూజ టికెట్ ధర సుమారుగా రూ.800 వరకు ఉండనుందని సమాచారం. టికెట్ తీసుకున్న మరుసటి రోజు ఉదయాన్నే భక్తుల పేరు, గోత్రానామాలు చదివి భక్తులకు చందనం (సింధూరం)తో పాటు ప్రసాదం అందజేస్తారు. ఇలా స్వామి వారికి చందనోత్సవం చేయించడం ద్వారా గ్రహపీడలు తొలగడం, చిన్న పిల్లలు అల్లరి మానడం, వ్యాపార అభివృద్ధి, అనుకున్న పనులు పూర్తవడం, చేపట్టిన కార్యాలు దిగ్విజయం అవుతాయని అర్చకులు చెబుతున్నారు. శ్రీరాముడికి ఇష్టమైన చందనం ఆంజనేయస్వామి వారికి నిత్యం అభిషేకం చేయడం ద్వారా ఆయన సంతోషంగా ఉండి కోరికలు తీరుస్తాడని భక్తుల ప్రగాఢ నమ్మకం



శ్రీఆంజనేయస్వామి విగ్రహం

స్వామివారికి ఇష్టం



చందనం అంటే శ్రీరాముడికి ఇష్టం. అందుకే కొండగట్టులో చందన పూజ నిర్వహించాలని నిర్ణయించారు. పూజ చేయడం ద్వారా భక్తులకు నరగోష ఉండదు. కష్టాలు దరిచేరవు. కోరికలు నెరవేరుతాయి.

– జితేంద్రప్రసాద్ స్వామి, కొండగట్టు ఆలయ ప్రధాన అర్చకులు

త్వరలో ప్రారంభం



దేవాదాయ కమిషనర్ ఆదేశాల మేరకు కొండగట్టు ఆలయంలో త్వరలోనే చందన పూజ ప్రారంభిస్తాం. టికెట్ ధరగా రూ.800 వరకు ఉండే అవకాశం ఉంది. చందనపూజలో పాల్గొనే భక్తులు ఒక్కరోజు ముందుగానే ఆలయ అధికారులను సంప్రదించాలి.

– వెంకటేశ్, ఈవో

మరణంలోనూ వీడని అన్నదమ్ముల అనుబంధం

- లక్కేపూర్ క్రాస్‌రోడ్డు వద్ద బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్
- ఘటనా స్థలంలో ఒకరు, ఆస్పత్రిలో మరొకరి దుర్మరణం
- కన్నీటిసంద్రమైన మృతుల కుటుంబసభ్యులు
- తల్లడిల్లిన తల్లి హృదయం.. రోదించిన మంథని



నాగరాజు (ఫైల్)



నవీన్ (ఫైల్)

మంథని: ఆ కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు.. అనూహ్యంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. మలివయసులో అండగా ఉంటారనుకున్న ఇద్దరు కుమారు హఠాత్తుగా చనిపోవడంతో ఆ తల్లి హృదయం తల్లడిల్లిపోయింది. ఈ విషాద సంఘటన మంథనిలో విషాదం నింపింది. పుట్టినప్పుంచి ఎంతో ఆప్యాయంగా పెరిగి వారి బంధాలు.. మరణంలోనూ ఒకటిగా కలిసే పోవడంతో స్థానికులు కన్నీటిపర్యంతమయ్యారు. ఎస్సై కిరణ్ కథనం ప్రకారం.. మంథని పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన తాటి నాగరాజు(42), ఆయన సోదరుడు నవీన్(35) రామగిరి మండలం బేగంపేటకు శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై పనినిమిత్తం వెళ్తున్నారు. అయితే, లక్కేపూర్ క్రాస్ రోడ్డు సమీపంలోకి వెళ్లగానే ఎదురుగా, అతివేగం వచ్చిన ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నవీన్ అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజును స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన అక్కేపల్లి గ్రామానికి చెందిన ట్రాక్టర్‌గా గుర్తించారు. అన్నదమ్ములను ఢీకొట్టిన ట్రాక్టర్ సమీపంలోని ప్లాట్ల వద్ద అదుపుతప్పి పడిపోయినట్లు సమాచారం. ప్లాట్లలో మట్టి పడి ఉంది. ట్రాక్టర్ బోల్తాపడిన ఆనవాళ్లు ఉన్నట్లు స్థానికులు అంటున్నారు. ట్రాక్టర్‌ను సరిచేసుకొని డ్రైవర్ అక్కడి పారిపోయినట్లు భావిస్తున్నారు. కాగా ప్రమాదంలో మృతి చెందిన నాగరాజుకు భార్య, కూతురు(12) ఉన్నారు. అలాగే నవీన్‌కు భార్య, సంవత్సరం, మూడేళ్ల కుమారులు ఉన్నారు. మృతులిద్దరూ డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. తల్లి రాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.



రోదిస్తున్న కుటుంబసభ్యులు

కదిలించిన హృదయాలు

మంథని సుభాష్‌నగర్‌కు చెందిన తాటి రాధ–బాపు దంపతులకు నలుగురు కుమారులు. అనారోగ్యంతో బాపు మూడేళ్ల క్రితం మృతి చెందాడు. భర్తను కోల్పోయిన రాధ.. దుఃఖాన్ని కడుపులోనే దాచుకుని తన కుమారులను చూసుకుంటోంది. ఇందులో ఇద్దరు డ్రైవర్లుగా పనిచేస్తుండగా, చిన్న కుమారుడు హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. మరో కుమారుడు అమాయకుడు కావడంతో ఇంటివద్దే ఉంటున్నాడు. కాగా, నాగరాజుకు కుమారుడు లేడు. దీంతో కూతురుతో చితికి నిప్పంటించారు. అలాగే నవీన్ పెద్దకుమారుడు(3)తో చితికి నిప్పు పెట్టించడంతో అక్కడున్నవారుకన్నీటి పర్యంతమయ్యారు. అందరితో కలివిడిగా ఉండే అన్నదమ్ములు ఒకేరోజు ప్రమాదంలో మృతి చెందడం విషాదం నింపింది.



అగ్గిపట్టిన మృతుల పిల్లలు

ఉచిత ఇళ్ల స్థలాల ప్రచారం అవాస్తవం

- భూ సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్

గన్నేరువరం: జగిత్యాల జిల్లా రాజారం శివారులో ఇళ్ల స్థలాలను ఉచితంగా ఇస్తున్నారన్న ప్రచారం అవాస్తమని, దీన్ని నమ్మి అక్కడికి వెళ్లొద్దని భూ సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు జక్కనపల్లి గణేశ్ అన్నారు. ఆదివారం గన్నేరువరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జీవో 58 ప్రకారం ఎలాంటి అభ్యంతరాలు లేని ప్రభుత్వ స్థలంలో అప్పటికే నివాసం ఉంటున్న దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేదలు మాత్రమే ఇంటి స్థలం పొందేందుకు అర్హులని తెలిపారు. స్థిర నివాసాలు లేక, సెంటు భూమి కూడా లేని స్థానికులైన నిరుపేదలకు మొదటి ప్రాధాన్యతగా అధికారులు ఇళ్ల స్థలాలు కేటాయిస్తారని పేర్కొన్నారు. గన్నేరువరం మండలం కరీంనగర్ జిల్లా ప్రాంతమని, జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ భూములను స్థానికేతరులకు ఇచ్చే అవకాశం లేదన్నారు. అవాస్తవ ప్రచారాన్ని నమ్మి ప్రజలు తమ విలువైన సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు.

అదనపు పనులు కొనసాగేనా?

- ఎన్నికలతో నెల క్రితమే ఆగిపోయిన వైనం
- బిల్లులు ఆగిపోతాయన్న అనుమానంతో నిలిపివేసిన కాంట్రాక్టర్
- రెండు ప్యాకేజీలుగా కాల్వ పనులు
- కాల్వ నిర్మాణంలో 600 ఎకరాలు ముంపు

పనులు ఇలా..

అదనపు టీఎంసీ కాల్వ నిర్మాణం : 23 కిలోమీటర్లు

కాల్వ వెడల్పు : 120 మీటర్ల నుంచి 160 మీటర్ల వరకు

కాల్వ విస్తరించి ఉన్న మండలాలు : రామడుగు, గంగాధర, బోయినపల్లి

పనులు జరిగినవి : సుమారు యాభై శాతం

బోయినపల్లి(చొప్పదండి): కాళేశ్వరం మూడో టీఎంసీ వరదకాల్వ పనులు మరోసారి నిలిచిపోయాయి. అసెంబ్లీ ఎన్నికలు రావడంతో బిల్లులు వస్తాయో.. రావోనని కాంట్రాక్టర్ ముందస్తుగానే పనులు నిలిపివేశాడు. నెల క్రితం ఆగిపోయిన పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులపై నిర్ణయం ఎలా ఉంటుందోననే అనుమానంతో పనులు మళ్లీ మొదలు పెట్టలేదని తెలిసింది.

23 కిలోమీటర్ల మేర వరద కాల్వ

కరీంనగర్ జిల్లా రామడుగు, గంగాధర మండలాల మీదుగా రాజన్నసిరిసిల్ల బోయినపల్లి మండలం వరదవెల్లి క్రాస్ రెగ్యులేటర్ వరకు సుమారు 23 కిలోమీటర్ల మేర అదనపు టీఎంసీ వరద కాల్వ చేస్తున్నారు.

- ఈ కాల్వ నిర్మాణంలో మూడు మండలాల రైతుల భూములు సుమారు 600 ఎకరాలు ముంపునకు గురయ్యాయి. కొంతమంది రైతులకు పరిహారం డబ్బులు రాగా, మరికొందరికి రావాల్సి ఉంది.
- ఈ పనులను రెండు ప్యాకేజీలుగా విభజించారు.
- రామడుగు మండలం శ్రీరాములపల్లి 99 కి.మీ నుంచి 113 కి.మీ వరకు ఒక ప్యాకేజీ, 113 కి.మీ నుంచి 122 కి.మీ వరకు రెండో ప్యాకేజీగా నిర్ణయించారు.
- దాదాపు 120 నుంచి 160 మీటర్ల వెడల్పుతో పాత వరదకాల్వను ఆనుకునే ఎడమ వైపు ఈ పనులు చేస్తున్నారు.
- ఇప్పుడు ఉన్న వరదకాల్వలో సుమారు రెండు టీఎంసీల మేర నీరు నిల్వ ఉంటుంది. అదనంగా మరో టీఎంసీ నీటి నిల్వ కోసం కొత్త కాల్వ పనులు రెండేళ్ల క్రితం ప్రారంభించారు.



దేశాయిపల్లి గ్రామ పరిసరాల్లో వరద కాల్వ నిర్మాణం

యాభై శాతం పూర్తి

అదనపు టీఎంసీ వరద కాల్వ నిర్మాణం పనులు సుమారు 23 కిలోమీటర్ల మేర చేపట్టాలి. రెండు కిలో మీటర్లు తప్ప మిగతా అన్ని చోట్ల పనులు ప్రారంభమైనట్లు తెలిసింది. వరదకాల్వ లోతు సుమారు 34 మీటర్లు, వెడల్పు సుమారు 80 నుంచి వందకుపైగా మీటర్ల మేర ఉంటుంది. పలు ప్రాంతాల్లో సుమారు యాభై శాతం మేర పనులు పూర్తి చేసినట్లు కాంట్రాక్టర్ల ద్వారా తెలిసింది. బోయినపల్లి మండలం దేశాయిపల్లిలో ముంపు ఇళ్ల ప్రాంతం, బీటీ రోడ్డు ఏరియాలో పనులు మొదలుకాలేదు. కొన్ని చోట్ల ఇంకా భూసేకరణ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభించలేదు.

బిల్లులపై అనుమానంతోనే ఆగిన పనులు ?

రాష్ట్ర ప్రభుత్వం మారడంతో బిల్లులు వస్తాయో.. రావోనని అనుమానంతో కాంట్రాక్టర్ పనులు నిలపివేసినట్లు సమాచారం. ఇప్పటికే పలు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంకా పనులు చేస్తే ఏమవుతుందోననే భయంతో పనులు పొందిన ఏజెన్సీ కాంట్రాక్టర్లు భావిస్తున్నట్లు సమాచారం. కాగా కొన్ని బిల్లులు పెండింగ్ ఉండడంతోనే పనులు ఆగాయని ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు చెప్పడం కొసమెరుపు.

ఇద్దరు యువకుల అరెస్ట్




పట్టుబడిన యువకులతో పోలీసులు

మెట్‌పల్లి: వేర్వేరు దొంగతనం కేసుల్లో ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. పట్టణ శివారులోని వట్టివాగు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా.. కోరుట్లకు చెందిన యువకులు తెన్నేరు శ్రీకాంత్, చంద్రగిరి పద్మాకర్ బైక్‌పై అక్కడకు వచ్చారు. అనుమానాస్పదంగా కనిపించిన వారిని సోదా చేయగా.. వారి వద్ద కరిగించిన బంగారం దొరికింది. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి విచారణ చేపట్టారు. ఈనెల 3న కళానగర్‌లో వృద్ధురాలి మెడలో నుంచి పుస్తెలతాడు అపహరించినట్లు, జగిత్యాల పట్టణంలోని ఓ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. వారి నుంచి ద్విచక్ర వాహనం, రూ.80వేలు, 25గ్రాముల బంగారాన్ని సీజ్ చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): భూ వివాదంలో దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు జమ్మికుంట పట్టణ సీఐ రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని విలాసాగర్‌కు చెందిన రాచపల్లి కుమార్, అతని సోదరులు శంకర్, సతీశ్, మహేందర్‌లకు మధ్య భూ వివాదం ఉంది. దీన్ని మనసులో పెట్టుకున్న ఆ ముగ్గురూ కుమార్, అతని భార్య కవిత ఆదివారం పొలంలో పని చేస్తుండగా వెళ్లి, కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో బాధితులకు తీవ్ర గాయాలయ్యాయి. కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు ఒకరి మృతి



రాంసమ్మయ్య (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతి చెందాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండలంలోని పాతర్లపల్లికి చెందిన రాంసమ్మయ్య(53) మందమర్రిలోని కూతురు ఇంటికి వెళ్లేందుకు ఆదివారం జమ్మికుంట రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. డౌన్ లూప్ లైన్‌లో ఆగి ఉన్న పీఎస్ఎన్‌హెచ్ గూడ్స్ రైలు కింద దూరి, 3వ ప్లాట్‌ఫాం పైకి ఎక్కేందుకు ప్రయత్నించగా అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. 108కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి, మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య రాధ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

బోరుబావిలో పడి మహిళకు గాయాలు

వీర్నపల్లి(సిరిసిల్ల): మండలంలోని అడవిపదిరలో ఓ పొలంలో మూసివేసిన బోరుబావిలో కాలు పడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. మండలంలోని గర్జనపల్లికి చెందిన గుంటుకు దేవేంద్ర అడవిపదిరలో నాటు వేసేందుకు వెళ్లింది. పొలాన్ని నాటుకు సిద్ధం చేస్తుండగా ట్రాక్టర్ కేజీవీల్ పొలంలోని కేసింగ్‌పైన ఉన్న బండరాయికి తగలడంతో అది తొలగిపోయింది. గమనించకుండా నాటువేస్తున్న దేవేంద్ర కాలు బోరులో పడి ఇరుక్కుంది. తీవ్రంగా గాయపడ్డ దేవేంద్రను వెంటనే ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని అమర్‌నగర్ (పాత కోర్టు) సమీపంలో నివాసముండే సామ చంద్రశేఖర్(38) ఆదివారం ఉరిపోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలం క్రితం చంద్రశేఖర్‌కు వివాహమైంది. ఆ తర్వాత భార్యతో విడాకులు అయ్యాయి. అప్పటినుంచి మద్యానికి బానిసైన చంద్రశేఖర్.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరిపోసుకొన్నాడని ఎస్సై మల్లేశ్ తెలిపారు. మృతుడి తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.